
సాక్షి
ఒడిశా
శుక్రవారం। 29। మార్చి। 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,91,485లు,బంగారం 5 గ్రాముల 130 మిల్లీగ్రాములు, వెండి 67గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్టు
గంజాం జిల్లాలోని గొళంతర పోలీసుస్టేషన్ పరిధి వన పల్లి గ్రామంలో జయజనార్ధన్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

- IIలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సెహరి
శుక్ర	శని
6.05	4.28

న్యూస్‌రీల్

సీఎం నవీన్‌తో భేటీ



ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో ఎమ్మెల్యే అభ్యర్థులు

రాయగడ: జిల్లాలోని రాయగడ, బిసంకటక్, గుణుపూర్ శాసనసభ నియోజకవర్గాల నుంచి సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీజేడీ పార్టీ అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో పార్టీ అభ్యర్థులు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, 5టీ అధ్యక్షుడు వీకే పాండ్యన్‌ను ముఖ్యమంత్రి కార్యాలయంలో గురువారం కలిశారు. బిసంకటక్ శాసనసభ నుంచి మాజీ మంత్రి జగన్నాథ సరక, గుణుపూర్ నుంచి రఘునాథ్ గొమాంగో, రాయగడ నుంచి అనసూయా మాఝిలు ముఖ్యమంత్రిని కలిసినవారిలో ఉన్నారు.

మున్సిపల్ చైర్మన్ రాజీనామా



మహేష్ పట్నాయక్

రాయగడ: రాయగడ శాసనసభ నుంచి బీజేడీ పార్టీ తరుపున సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎస్టీసీ చైర్‌పర్సన్ అనసూయా మాఝికి అధిష్టానం టిక్కెట్టు ఖరారు చేయడంతో, అసంతృప్తి చెందిన ఆ పార్టీ నాయకులు వరుసగా ఒక్కొక్కరూ రాజీనామాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మున్సిపల్ చైర్మన్ పి.మహేష్ పట్నాయక్ బీజేడీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. ఈ మేరకు తన రాజీనామా పత్రాన్ని జిల్లా ఎన్నికల పరిశీలకుడు అతున్ సవ్యసాచి నాయక్‌తో పాటు బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావుకు సమర్పించారు. అదేవిధంగా రాయగడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్, మజ్జిగౌరి మందిరం మేనేజింగ్ ట్రస్టీ రాయిసింగి బిడిక కూడా బీజేడీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

సీఎం నవీన్ పట్నాయక్‌కు ధన్యవాదాలు


- మాజీ మంత్రి జగన్నాథ సరక



జగన్నాథ సరక

రాయగడ: జిల్లాలోని బిసంకటక్ శాసనసభ నియోజకవర్గం నుంచి మరోసారి మాజీ మంత్రి జగన్నాథ సరక పోటీ చేయనున్నారు. ఈ మేరకు మరోసారి తనకు అవకాశం కల్పించిన సీఎం నవీన్ పట్నాయక్‌కు బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలియజేశారు. ప్రత్యర్థి ఎవరైనప్పటికీ ముఖ్యమంత్రి అమలు చేసిన ప్రజా సంక్షేమ పథకాలే తనను విజయపథంలో నడిపిస్తాయని దీమా వ్యక్తం చేశారు. బిసంకటక్ శాసనసభను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు, ప్రజల ఆర్థిక సామాజిక రంగాల పురోగతికి తన వంతు కృషి చేస్తానని వెల్లడించారు.

'కార్యకర్తలు కథనరంగంలోకి దూకాలి'



మాట్లాడుతున్న ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలోని అధికార బీజేడీ పార్టీ కార్యకర్తలు ఎన్నికల కథన రంగంలోకి దూకాలని ఆ పార్టీ జిల్లా పరిశీలకుడు, కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని స్థానాలకు గాను పార్టీ అభ్యర్థుల పేర్లు ప్రకటించారని తెలియజేశారు. నబరంగ్‌పూర్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రదీప్ మజ్జి, నబరంగ్‌పూర్ అసెంబ్లీ అభ్యర్థిగా కౌసల్య ప్రధాని, డాబుగాం అభ్యర్థిగా మనోహర్ రంధారి, ఉమ్మర్ కోట్ అభ్యర్థిగా నవీనా గొండో, ఝొరిగాం అభ్యర్థిగా రమేష్ మజ్జిలు బరిలో ఉన్నారన్నారు. చాలాకాలంగా అభ్యర్థులంతా ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరిస్తున్నారని గుర్తు చేశారు. అనేక సర్వేలు, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు, వారి పనితీరు ప్రమాణికంగా టిక్కెట్ల కేటాయింపు జరిగిందన్నారు. పార్టీ పరిశీలకుని హోదాలో కార్యకర్తల అభిప్రాయానికే పెద్దపీట వేశానన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా నవీన్ పట్నాయక్‌ను ఆరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్రస్థాయి ముఖ్య నాయకులు కార్తికేయ పాండ్యన్, బబి దాస్‌లు కూడా నబరంగ్‌పూర్ జిల్లాపై ప్రత్యేక శ్రద్ధ చూపారని వెల్లడించారు.

రాజకీయాల్లో రాజముద్ర



- రాష్ట్ర రాజకీయాల్లో రాజ వంశీయుల ప్రాతినిధ్యం
- వంశపారపర్యంగా పోటీలో నిలుస్తున్న వారసులు
- విజయాలు సాధిస్తూ ప్రత్యేక గుర్తింపు



సంగీత కుమార్ సింఘ్‌దేవ్



కలికేష్ నారాయణ సింఘ్‌దేవ్



ప్రతాప్ కేశరి దేవ్

2024 సార్వత్రిక సమరం

భువనేశ్వర్:

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ అమలైనప్పటి నుంచే రాజుల పాలనకు తెర పడింది. అయితే ప్రజాస్వామ్య పోకడలో రాజ వంశీకులు వంశపారపర్యంగా చట్ట సభలకు ప్రజా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఒడిశా రాజకీయాల్లో చాలా మంది పూర్వపు రాజ కుటుంబాల సభ్యులు చురుకైన పాత్ర పోషిస్తున్నారు. ప్రత్యేక గుర్తింపును పొందుతూ ప్రతి ఎన్నికల్లోనూ ప్రజాస్వామ్య పోరులో అభ్యర్థిత్వాలు చేజిక్కించుకుంటున్నారు.

స్వాతంత్ర్యం తర్వాత...

స్వాతంత్ర్యం తర్వాత పాట్నా రాష్ట్ర మహారాజా రాజేంద్ర నారాయణ్ సింఘ్‌దేవ్ ఒడిశా రాజకీయాల్లో ముఖ్యమైన పాత్ర పోషించారు. ఆయన 1967లో ముఖ్యమంత్రి అయ్యారు. అతని ఇద్దరు కుమారులు రాజరాజ్ సింఘ్‌దేవ్, అనంగ్ ఉదయ్ సింఘ్‌దేవ్‌లు బొలంగీర్, పట్నాగడ్ రాజకీయాల్లో చురుకుగా కొనసాగుతున్నారు. ఈ రెండు కుటుంబీకులు బొలంగీరు ప్రాంతంలో భారతీయ జనతా పార్టీ, బిజు జనతా దళ్‌కు ప్రాణాధారంగా ప్రాధాన్యత సంతరించుకోవడం విశేషం. అనంగ్ ఉదయ్ సింఘ్‌దేవ్ కుమారులు కళికేష్ నారాయణ సింఘ్ దేవ్, అర్కేష్ సింఘ్‌దేవ్ నేటి తరం రాజ వంశీకులుగా తళుక్కుమంటున్నారు. వీరి తండ్రి అనంగ ఉదయ్ సింఘ్‌దేవ్ 1974 నుంచి 1977, 1990 నుంచి 2014 సంవత్సరం వరకు రాష్ట్ర శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. 2014 నుంచి 2018 సంవత్సరం వరకు రాజ్యసభ సభ్యునిగా కొనసాగారు. 2011 సంవత్సరంలో కటక్ నగరం కల్తీ సారా మృతుల సంఘటనకు బాధ్యత వహించి నవీన్ కొలువులో అబ్కారీ శాఖ కేబినెట్ మంత్రి పదవికి రాజీనామా చేసి, నైతిక విలువల పరిరక్షణ కోసం ప్రత్యక్ష రాజకీయాలకు దూరం అయ్యారు. నేటి తరంలో బొలంగీరు రాజ వంశానికి కొత్త వన్నె దిద్దారు.

ప్రస్తుతం జరగనున్న శాసనసభ ఎన్నికలకు కలికేష్ నారాయణ సింఘ్‌దేవ్‌కు బిజూ జనతా దళ్ టికెట్టు కట్టబెట్టి బొలంగీరు నియోజకవర్గం నుంచి బరిలోకి దింపింది. లోగడ 2009, 2014లో ఆయన బీజేడీ అభ్యర్థిగా బొలంగీర్ నియోజకవర్గానికి పార్లమెంటులో ప్రాతినిధ్యం వహించారు. అదేవిధంగా ఆర్.ఎన్.సింఘ్‌దేవ్ మనవడు కనక్ వర్దన్ సింఘ్‌దేవ్ పట్నాగడ్ అసెంబ్లీ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఉంది. పట్నాగడ్ నుంచి 5 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన 2019 ఎన్నికల్లో బీజేడీకి చెందిన సరోజ్ మెహర్ చేతిలో ఓడిపోయారు. కనక వర్దన్ సింఘ్‌దేవ్ భార్య సంగీత కుమారి సింఘ్‌దేవ్ 2019లో బొలంగీర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి భారతీయ జనతా పార్టీ అభ్యర్థిగా గెలిపొందారు. తాజాగా జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ మళ్లీ నామినేట్ చేసి బరిలోకి దింపింది. సంగీత కుమారి సింఘ్‌దేవ్ 1998, 1999, 2004, 2019లో బొలంగీర్ లోక్‌సభ స్థానం నుంచి ఎన్నికయ్యారు. ఈమె 2009, 2014లో అదే స్థానంలో తన బావ కళికేష్ నారాయణ్ సింఘ్‌దేవ్ చేతిలో ఓడిపోయారు. అయితే 2019లో జరిగిన ఎన్నికల్లో ఈమె కాళికేష్‌పై స్వల్ప ఆధిక్యతతో విజయం సాధించారు. మొత్తం మీద బొలంగీరు రాజకీయాల్లో సింఘదేవ్ కుటుంబీకులే ప్రాతినిధ్యం వహించడం గమనార్హం.

కేంద్రాపడా జిల్లాలో...

కేంద్రాపడా జిల్లాలో కూడా రాజ వంశీకుల ప్రాతినిధ్యం బలంగా కొనసాగుతోంది. ఈ జిల్లా ఔల్ శాసనసభ నియోజక వర్గం నుంచి బీజేడీ సీనియర్ నాయకుడు, మంత్రి ప్రతాప్ కేశరీ దేబ్‌ను పార్టీ ఈసారి ఎన్నికల్లో పోటీకి ఖరారు చేసింది. ఖండపడా రాజవంశీకుడు సిద్ధార్థ్ శేఖర్ సింగ్ 2009 నుంచి 2014 వరకు బీజేడీ ఎమ్మెల్యేగా ఎన్నిక అయ్యారు. తర్వాత అతను బీజేపీపై విధేయత ప్రదర్శించారు. గత ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థి సౌమ్య రంజన్ పట్నాయక్‌పై, బీజేపీ అభ్యర్థిగా ఖండపడా నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీచేసి 2019 ఎన్నికలలో విఫలమయ్యాడు.

గంజాం రాజకీయాల్లో...

గంజాం రాజకీయాల్లో మాజీ సంస్థానాల సభ్యులు ప్రత్యేక పాత్ర పోషిస్తున్నారు. ఒడిశాలో 10 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఖల్లికోట్ మహారాణి వి.సుజ్ఞాన్ కుమారి దేవ్ ఇటీవల మరణించారు. ఆమె సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఖల్లికోట్, కవిసూర్యనగర్‌లలో రాజకీయ రంగంలో మకుటం లేని మహారాణిలా వెలిగొందారు. అదేవిధంగా చికిటి రాణి మంత్రి ఉషాదేవి దక్షిణ ఒడిశాలో బిజూ జనతా దళ్ ప్రముఖ మహిళా నాయకురాలు. ఉషా దేవి ఈసారి ఎన్నికల పోరుకు దూరమయ్యి ఆమె కుమారుడు చిన్మయానంద శ్రీరూప్ దేబ్‌ను ప్రత్యక్ష పోరుకు బరిలోకి దింపి వారసత్వ ప్రజాస్వామ్యానికి పీఠం వేశారు. ఈసారి చికిటి అసెంబ్లీ నియోజకవర్గానికి బీజేడీ చిన్మయానంద శ్రీరూప్ దేబ్‌కు టికెటు కేటాయించింది. 2014 ఎన్నికల్లో సన్నాఖెముండి అసెంబ్లీ స్థానం నుంచి ధరాకోట్ రాణి నందినీ దేవి బీజేడీ టిక్కెట్‌పై ఎన్నికయ్యారు. అయితే 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రమేష్ జెనా చేతిలో ఆమె ఓడిపోయారు. ఈసారి ఆమె కుమార్తె సులక్షణ గీతాంజలి దేవి ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు సమాచారం. గజపతి రాజ కుటుంబానికి చెందిన కల్యాణి గజపతి 2019 ఎన్నికల్లో బీజేడీ అభ్యర్థిగా పోటీ చేశారు. గత ఎన్నికల్లో ఓడిపోవడంతో ఆమె రాజకీయ జీవితం ముగిసినట్లే అని భావించారు. ఢెంకనాల్ రాజ కుటుంబం నుంచి వచ్చిన ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి కామాఖ్య ప్రసాద్ సింఘ్‌దేవ్ ఇప్పుడు రాజకీయాల్లో చురుకుగా లేరు. అయితే ఆయన కోడలు మృణాల్ కుమారి సింఘ్‌దేవ్ ఈసారి కాంగ్రెస్ టిక్కెట్‌పై ఢెంకనాల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఉంది. కలహండి రాజ కుటుంబానికి చెందిన బీజేడీ నాయకుడు, మాజీ మంత్రి పుష్పేంద్ర సింఘ్‌దేవ్ 2019 లోక్‌సభ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి బసంత్ పండా చేతిలో ఓడిపోయారు. ఈసారి బీజేపీ ఈ స్థానం నుంచి కలహండి రాజ కుటుంబానికి చెందిన అర్క కేశరి దేవ్ భార్య మాళవికా దేవిని పోటీకి దింపింది. అర్క కేశరి దేవ్ తన తండ్రి బిక్రమ్ కేశరి దేవ్ మరణం తర్వాత 2014లో కలహండి స్థానం నుంచి బీజేడీ అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆయన 3 సార్లు ఈ స్థానాన్ని గెలుచుకుని వారసత్వ రాజకీయాలకు గట్టి పునాది వేశారు. 2019లో పార్టీ టిక్కెట్ నిరాకరించడంతో అర్క కేశరి దేవ్, అతని భార్య బీజేడీని విడిచి పెట్టారు. వారు 2023లో బీజేపీలో చేరారు.

కొనసాగుతున్న సస్పెన్స్

- కొరాపుట్‌లో మూడు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించని బీజేడీ



పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాఢీ



లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీ



జయపూర్ మాజీ ఎమ్మెల్యే రబినారాయణ నందో, అతని సతీమణి ఇందిరా నందో

కొరాపుట్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి బీజేడీ తమ అభ్యర్థుల రెండు జాబితాలను బుధవారం ప్రకటించడంతో బీజేడీ క్యాడర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా జోష్ పెరిగింది. కానీ కొరాపుట్ జిల్లాలో మాత్రం నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. అవిభక్త కొరాపుట్ జిల్లాల్లో 2 లోక్‌సభ, 14 అసెంబ్లీ స్థానాలకు గానూ, బీజేడీ 2 లోక్‌సభతో పాటు, 10 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇంకా మిగిలిన 4 అసెంబ్లీ స్థానాలను ఇంకా ప్రకటించలేదు. ఈ ప్రకటించని 4 స్థానాల్లో మూడు కొరాపుట్ జిల్లావే కావడం విశేషం. వాటిలో మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ, కొరాపుట్ జిల్లాలోని జయపూర్, పొట్టంగి, లక్ష్మీపూర్‌లు ఉన్నాయి. కొరాపుట్ ఎంపీ అభ్యర్థిగా కౌసల్య హిక్కా, కొరాపుట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రఘురాం పాడాల్, కోట్‌పాడ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా చంద్రశేఖర్ మజ్జిలను పార్టీ ప్రకటించింది.

మూడు స్థానాలు.. అనేక వివాదాలు

కొరాపుట్ జిల్లాలో ప్రకటించని మూడు స్థానాల్లో అనేక వివాదాలు ఉన్నాయి. ఆయా స్థానాల్లో టిక్కెట్లు ఆశిస్తున్నవారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. పొట్టంగి సిట్టింగ్ ఎమ్మెల్యే పీతం పాఢీ గత సార్వత్రిక ఎన్నికల సమయంలో పోలింగ్‌కి 16 రోజులు ముందు పార్టీలో చేరి గెలిపొందారు. అయితే ఇప్పుడు ఈ స్థానాన్ని పీతం పాఢీతో పాటు ఆదే పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే ప్రఫుల్ల పంగి, ఎస్టీసీ వైస్ చైర్‌పర్సన్ లక్ష్మీ హంతాల్, జెడ్పీ సభ్యుడు లైచన్ ఖొరాలు ఆశిస్తున్నారు. అంతేకాక విపక్ష పార్టీ నుంచి ఒక మాజీ ఎమ్మెల్యే కూడా పార్టీలోకి వస్తారని ప్రచారం జరుగుతోంది. లక్ష్మీపూర్‌లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రభుజానీ టిక్కెట్ ఆశిస్తున్నారు. ప్రభు గతంలో జెడ్పీ అధ్యక్షుడిగా పనిచేశారు. గత సార్వత్రిక ఎన్నికల్లో 219 ఓట్ల మెజారిటీతో గెలిపొందారు. తర్వాత పరిణామాల్లో భాగంగా కాంగ్రెస్‌కి చెందిన మాజీ ఎమ్మెల్యే కైలాష్ కులసిక బీజేడీలో చేరి టిక్కెట్ ఆశిస్తున్నారు. అయితే ఈ స్థానం మహిళలకు పార్టీ కేటాయిస్తుందని ప్రచారం జరగడంతో ప్రస్తుత జెడ్పీ అధ్యక్షురాలు సస్మితా మెలకా పేరు వినిపిస్తుంది. మరోవైపు అవిభక్త కొరాపుట్ జిల్లాలో ఏకైక జనరల్ స్థానం జయపూర్‌పై కూడా అనిశ్చితి కొనసాగుతోంది. ఈ స్థానం నుంచి వరుసగా మూడు సార్లు గెలిచి, మరలా వరుస రెండుసార్లు ఓడిపోయిన రబి నారాయణ నందో ఇక్కడ టిక్కెట్ ఆశిస్తున్నారు. అధికార బీజేడీ మరోసారి ఇక్కడ ఓడిపోవడానికి సిద్ధంగా లేదు. ఎలాగైనా ఈసారి జయపూర్‌లో గెలుస్తామని ఇదివరకే రాష్ట్ర నాయకులు ఇక్కడకి వచ్చినప్పుడల్లా ప్రకటించారు. రబినందోపై ప్రజా వ్యతిరేకత ఉందనే అనుమానంతో గత 5 ఏళ్లుగా అతని సతీమణి ఇందిరా నందో ప్రజాక్షేత్రంలో తిరుగుతున్నారు. దీంతో ఎమ్మెల్యే అభ్యర్థి స్థానానికి రెండుసార్లు కేసీసీ బ్యాంక్ అధ్యక్షురాలిగా గెలిపొందిన ఇందిరా పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. ఆమెతో పాటు నందో వ్యతిరేక వర్గీయుల నుంచి ప్రముఖ వ్యాపారవేత్త సుభాస్ రౌత్ పేరు ప్రచారంలో ఉంది. సుభాష్‌కి పార్టీ జిల్లా ముఖ్య నాయకుడు ఆశీర్వాదం ఉండడంతో పోటీలో నిలిచారు. దీంతో ఇక్కడ నందో కుటుంబమా లేక సుభాష్ రౌతా అనే తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఏది ఏమైనా కొరాపుట్ జిల్లాలో ఐదింట మూడు స్థానాలు ప్రకటించకపోవడంతో జిల్లావ్యాప్తంగా రాజకీయ నిశ్శబ్దం కొనసాగుతోంది.

కాంగ్రెస్‌కు షాక్..!

భువనేశ్వర్: రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, జట్నీ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే సురేష్ కుమార్ రౌత్రాయ్ పార్టీ కమిటీల సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన కొడుకు మన్మథ్ రౌత్రాయ్ తన మాట లెక్క చేయకుండా బిజూ జనతా దళ్‌లో చేరడంతో ఆయన తీవ్ర మనస్తాపానికి లోనయ్యి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వానికి తన రాజీనామా లేఖను పంపారు. పార్టీలోని అన్ని పదవులకు రాజీనామా చేస్తున్నానని, అయితే తుదిశ్వాస వరకు కాంగ్రెస్‌లోనే ఉంటానని లేఖలో పేర్కొన్నారు. తన చిన్న కుమారుడు మన్మథ్ రౌత్రాయ్ బుధవారం శంఖ భవన్‌లో అధికార బిజూ జనతా దళ్‌లో చేరిన తర్వాత సురేష్ కుమార్ రౌత్రాయ్ తీవ్రంగా స్పందించారు. మన్మథ్ తన అనేక మంది మద్దతుదారులు, కొంతమంది కౌన్సిలర్లతో కలిసి భారీ ర్యాలీతో బీజేడీ ప్రధాన కార్యాలయానికి చేరి ప్రముఖుల సమక్షంలో బీజేడీలో చేరినట్లు అధికారికంగా ప్రకటించారు. అనుభవజ్ఞుడైన నాయకుడిగా సురేష్‌కుమార్ రౌత్రాయ్ జట్నీ నియోజకవర్గం నుంచి 6 సార్లు రాష్ట్ర శాసనసభకు ఎన్నికయ్యారు. తొలుత 1977లో జనతా పార్టీ టికెట్‌పై నియోజకవర్గం నుంచి గెలిపొందారు. ఆ తర్వాత 1980, 1985, 1995, 2000, 2019లో కాంగ్రెస్ అభ్యర్థిగా జట్నీ నియోజకవర్గం నుంచి శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు.

బీజేడీలో భగ్గుమన్న విభేదాలు

- అనసూయా మాఝికి టిక్కెట్టు కేటాయింపుపై రభస
- కొనసాగుతున్న రాజీనామాలు



మాట్లాడుతున్న గంగాధర్ పువ్వల, పక్కనే పార్టీ నాయకులు



మాట్లాడుతున్న కొండబాబు

రాయగడ: రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం బీజేడీ అభ్యర్థుల తొలి రెండు జాబితాలను సీఎం నవీన్ పట్నాయక్ బుధవారం ప్రకటించారు. దీనిలో భాగంగా రాయగడ శాసనసభ నుంచి అనసూయా మాఝికి టిక్కెట్టు కేటాయించడంపై పెద్ద దుమారం రేగుతోంది. ఒక వర్గం అనసూయాకు మద్దతు పలుకుతుంటే, మరోవర్గం పూర్తిగా వ్యతిరేకిస్తోంది. దీంతో ఒక్కసారిగా బీజేడీలో సద్దుమణిగిన విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో దీని ప్రభావం ఎంతవరకు ఉంటుందో చూడాల్సిందే. ఇదిలాఉండగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఎల్ల కొండబాబు ఆధ్వర్యంలో గురువారం స్థానిక రింగ్ రోడ్డు సమీపంలోని బీజేడీ కార్యకర్తల కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. సమావేశంలో సీనియర్ నాయకులు, న్యాయవాది బ్రజసుందర్ నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ శుభ్రా పండ, పట్నాన గౌరి శంకర్, కాశీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు కేటాయించడం హర్షణీయం

ఏడు దశాబ్దాల తర్వాత ఒక మహిళకు ఈ స్థానం కేటాయించడం హర్షణీయమని ఎల్ల కొండబాబు అన్నారు. రాయగడ శాసనసభ నుంచి ఈసారి ఎన్నికల బరిలో ఒక మహిళకు స్థానం కల్పించడం, నవీన్ పట్నాయక్ మహిళలకు ఇస్తున్న గౌరవాన్ని మనమంతా అభినందించాలన్నారు. రాష్ట్ర మాజీ మంత్రి అనంతరామ్ మాఝి కుమార్తైన అనసూయా మాఝికి టిక్కెట్టు కేటాయింపు గొప్ప విషయమని కొనియాడారు. ఆమె విజయానికి తామంతా కృషి చేస్తామని తెలియజేశారు. టిక్కెట్టు కేటాయింపును వ్యతిరేకిస్తూ కొంతమంది రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించడం సరికాదన్నారు. ఏదిఏమైనప్పటికీ ఈసారి రాయగడలో బీజేడీ జెండా ఎగురవేయడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు.

కేటాయింపు సరికాదు

అలాగే అనసూయా మాఝికి టిక్కెట్టు ఖరారు చేయడంపై మరోవర్గం అసంతృప్తిగా ఉంది. ఈ మేరకు స్థానిక తేజస్విని హోటల్‌లో జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర్ పువ్వల నేతృత్వంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పువ్వల మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా బీజేడీకి సేవలందిస్తున్న తమ వర్గానికి చెందినవారిని సంప్రదించకుండా, అనసూయా మాఝికి టిక్కెట్టు ఖరారు చేయడం సరికాదన్నారు. తమ నిరసనను వ్యక్తం చేసేందుకు మున్సిపాలిటీలోని బీజేడీ కౌన్సిలర్లు, సమితి అధ్యక్షులు, సభ్యులు, సర్పంచ్‌లు సామూహికంగా రాజీనామాలు చేసి, బీజేడీ కార్యాలయానికి, అదేవిధంగా జిల్లా ఎన్నికల పరిశీలకుడు అతున్ సవ్యసాచి నాయక్‌కు పంపించడం జరిగిందన్నారు. ఒకవేళ అనసూయా మాఝి ఎన్నికల బరిలో ఉంటే విజయానికి ఎటువంటి సహకారాన్ని అందించమని స్పష్టం చేశారు. అధిష్టానం దీనిపై ప్రతిస్పందించాలని కోరారు. సమావేశంలో రాయగడ సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, బిజు మహిళా జనతాదళ్ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షురాలు సుజాత పాలో, బీజేడీ పట్టణ శాఖ అధ్యక్షుడు బార్జి దశరథి నాయుడు, మున్సిపాలిటీ కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ఈపీడీసీఎల్ డైరెక్టర్



శ్రీనివాసమూర్తికి జ్ఞాపిక అందజేస్తున్న కృష్ణమాచార్యులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ శ్రీనివాసమూర్తి గురువారం దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరించారు. ఈయన వెంట విద్యుత్ శాఖ ఎస్ఈ కృష్ణమూర్తి, డి-1, డి-2 ఏఈలు కమల్‌హాసన్, సురేష్‌కుమార్, జిల్లా విద్యుత్ కాంట్రాక్టర్ల సంఘ అధ్యక్షుడు ఉంగటి పాపారావు తదితరులున్నారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

నందిగాం: మండలంలోని పెద్దతామరాపల్లికి చెందిన తన కుమార్తె (22)ఈ నెల 23 నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి గురువారం నందిగాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టెక్కలి వెళ్తానని చెప్పి తిరిగి రాలేదని, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఫలితం లేకపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిత్యాలయ అటెండర్ సస్పెన్షన్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో రెగ్యులర్ అటెండర్‌గా పనిచేస్తున్న శిమ్మ భాస్కరరావును విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఈవో ఎస్.చంద్రశేఖర్ గురువారం తెలిపారు. కొన్ని రోజులుగా ఎలాంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఆలయంలో పనిచేస్తున్న రెగ్యులర్/ దినసరి వేతన ఉద్యోగులు కూడా కచ్చితంగా విధులు సక్రమంగా నిర్వర్తించాలని, సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఈవో హెచ్చరించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



ఎంపికైన అభ్యర్థులతో ప్రిన్సిపాల్ సురేఖ, హరిత తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు కళాశాల, నోడల్ జేకేసీ, కళాశాల కెమిస్ట్రీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో హెట్రో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన ఈ జాబ్ మేళాకు 118 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. వివిధ పరీక్షలు, స్క్రీనింగ్‌ల అనంతరం 42 మంది అభ్యర్థులను కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. కార్యక్రమంలో హెట్రోఫార్మా కంపెనీ హెచ్ఆర్‌లు జి.రాజు, సీహెచ్ మణికంఠ, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రోణంకి హరిత, జేకేసీ కోఆర్డినేటర్ వై.మణికంఠ, జేకేసీ మెంటార్స్ ఎస్.దామోదర్, కె.దేముల్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీజేపీలోకి వలసలు



బీజేపీలో చేరిన భర్తృహరి మహతాబ్



బీజేపీలో చేరిన సిద్ధాంత మహాపాత్రో



బీజేపీలో చేరిన దమయంతి బేశ్రా

భువనేశ్వర్: బిజూ జనతా దళ్‌కు చెందిన ప్రముఖులు భారతీయ జనతా పార్టీలో గురువారం చేరారు. వీరిలో కటక్ నుంచి 6 సార్లు ఎంపీగా గెలిచిన భర్తృహరి మహతాబ్, బరంపురం మాజీ పార్లమెంట్ సభ్యుడు, నటుడు సిద్ధాంత మహాపాత్రో, ప్రముఖ సంతాలి రచయిత దమయంతి బేశ్రా ఉన్నారు. వీరు ముగ్గురూ గురువారం ఢిల్లీలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే, కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్, జాతీయ ఉపాధ్యక్షుడు బైజయంత్ జై పండా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్‌లు వీరిని ఆహ్వానించారు.

1998 నుంచి భర్తృహరి ప్రాతినిధ్యం

భర్తృహరి మహతాబ్ 1998 నుంచి కటక్ నియోజకవర్గం బిజూ జనతా దళ్ అభ్యర్థిగా పార్లమెంట్‌కు నిరవధికంగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అసుర శక్తి బీజేడీని ఆవహించిందని, ఇది ప్రభుత్వంపై గట్టిపట్టు సాధించిందని భర్తృహరి వ్యాఖ్యానించారు. ఈనెల 22న ఆయన బీజేడీకి రాజీనామా చేశారు. అది మొదలుకొని భర్తృహరి మహతాబ్ బీజేపీలో చేరి కటక్ లోకసభ స్థానం నుంచి పోటీ చేస్తారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. క్రమంగా ఈ ఊహాగానాలు వాస్తవ రూపం దాల్చుతున్నాయి. కటక్ పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి బిజూ జనతా దళ్ ఆదిత్య బిర్లా గ్రూప్ మాజీ మానవ వనరుల విభాగానికి చెందిన సంతృప్త్ మిశ్రాను బరిలోకి దింపింది. ఈయనతో భర్తృహరి మహతాబ్ తలపడాల్సిన పరిస్థితులు పొంచి ఉన్నాయి. అతి త్వరలో ఈ చిత్రం స్పష్టమయ్యే అవకాశం ఉంది. అలాగే సిధాంత్ మహాపాత్రో 2009లో బిజూ జనతా దళ్‌లో చేరారు. అదే సంవత్సరం గంజాం జిల్లా బరంపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజేతగా నిలిచారు. 2014 సాధారణ ఎన్నికల్లో దాదాపు 1,00,000 ఓట్ల భారీ తేడాతో తిరిగి ఎన్నికయ్యారు. బీజేడీ గత 2019 ఎన్నికల్లో నటుడిగా మారిన రాజకీయ నాయకుడు సిధాంత మహాపాత్రో స్థానంలో, అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు, కేంద్ర మాజీమంత్రి చంద్రశేఖర్ సాహుకి పట్టం గట్టి బరిలోకి దింపింది. అదేవిధంగా దమయంతి బేశ్రా సంతాలీ భాషలో ప్రసిద్ధి చెందిన సాహిత్యవేత్త. ఒడియా మరియు సంతాలి సాహిత్యానికి ఆమె చేసిన కృషికి అనేక అవార్డులు అందుకుంది. ఆమెకు 2020లో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

అభ్యర్థులకు అభినందనలు



ఎంపీ రమేష్ మజ్జిని అభినందిస్తున్న మహిళా కార్యకర్తలు



కౌసల్య ప్రదానిని ఆశీర్వదిస్తున్న వేద పండితుడు



కౌసల్య హిక్కా, రఘురాం పొడాల్‌ను అభినందిస్తున్న కైలాస్ కులసిక



ప్రదీప్‌ని అభినందిస్తున్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రదాని తదితరులు

కొరాపుట్: అధికార బీజేడీ తరుపున అభ్యర్థులుగా ప్రకటించబడిన వారికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే రఘురాం పొడాల్ నివాసం కార్యకర్తలతో కిటకిటలాడింది. అక్కడ కొరాపుట్ లోక్‌సభ అభ్యర్థి కౌసల్య హిక్క, కొరాపుట్ ఎమ్మెల్యే అభ్యర్థి రఘురాం పొడాల్, కౌసల్య భర్త మాజీ ఎంపీ జిన్ను హిక్కలకు లక్ష్మీపూర్ మాజీ ఎమ్మెల్యే కైలాష్ కులసిక తదితరులు అభినందించారు. నబరంగ్‌పూర్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించబడిన ఎస్టీసీ సలహాదారుడు ప్రదీప్ మజ్జిని జిల్లా కేంద్ర పార్టీ కార్యాలయంలో నాయకులు అభినందించారు. నబరంగ్‌పూర్ అసెంబ్లీ అభ్యర్థి కౌసల్య ప్రదానికి పలు మైనారిటీ సంఘాలు, వేదపండితులు మద్దతు తెలిపాయి. ఈమె ప్రస్తుత ఎమ్మెల్యే సదాశివ ప్రదాని సతీమణి కావడం గమనార్హం. ఉమ్మర్‌కోట్ పట్టణంలో ఎంపీ రమేష్ చంద్ర మజ్జిని అతని నివాసంలో పలువురు కలిసి అభినందించారు. అనంతరం పార్టీ ఆదేశంతో అభ్యర్థులంతా హుటాహుటీన భువనేశ్వర్ బయల్దేరి వెళ్లారు.

175 కిలోల గంజాయి స్వాధీనం



రాయగడ: పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీసులు బుధవారం సాయంత్రం నిర్వహించిన తనిఖీల్లో భాగంగా కెందుగుడ పోలీసుస్టేషన్ సమీపంలో, సిమిరి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 175 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారం మేరకు పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు. అయితే పోలీసులు వస్తున్నారని గమనించిన నిందితులు, గంజాయితో తీసుకొచ్చిన 5 బ్యాగులను విడిచి వెళ్లిపోయారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బరంపురం: అరెస్టైన నిందితులు

ఇద్దరు నిందితులు అరెస్టు

బరంపురం: గంజాయి రవాణ చేస్తున్న ఇద్దరు అంతరాష్ట్ర నేరస్తులను దిగపండి పోలీసులు అరెస్టు చేశారు. జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో నేరారోపణ కేసులతో సంబంధం ఉన్నటువంటి ఇద్దరు నేరస్తులు రంజన్ నాయక్, రుణికేష్ రెడ్డిలను అరెస్టు చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచారు. వీరిపై ముంబాయిలో కేసులు ఉండడంతో కోర్టు ఆదేశాలకు ముంబాయి పోలీసులకు అప్పగించారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- రాష్ట్రంలో 5 చోట్ల 39 డిగ్రీల నమోదు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఎండ తీవ్రత పెరుగుతోంది. గురువారం ఈ తీవ్రత మరింత ఎక్కువయ్యింది. రాష్ట్రంలో 5 చోట్ల పగటిపూట గరిష్ట ఉష్ణోగ్రత 39 డిగ్రీల సెల్సియస్ పైబడి నమోదయ్యింది. మరో 11 ప్రాంతాల్లో 38 డిగ్రీల సెల్సియస్ పైబడి గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. స్థానిక భారత వాతావరణ శాఖ ప్రాంతీయ కేంద్రం (ఐఎండీ) జారీ చేసిన బులెటిన్ ప్రకారం గజపతి జిల్లా పర్లాకిమిడి అత్యధిక వేడి ప్రాంతంగా నిలిచింది. ఇక్కడి పగటి పూట గరిష్ట ఉష్ణోగ్రత 39.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అయింది. 39.5 డిగ్రీల సెల్సియస్‌తో బౌధ్ తదుపరి స్థానంలో నిలిచింది. జంట నగరాలైన భువనేశ్వర్, కటక్ ప్రాంతాల్లో వరుసగా 37.3, 38.4 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. రానున్న 2 రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రత 2 నుంచి 3 డిగ్రీల సెల్సియస్ మేర క్రమంగా పెరుగుతుందని ఐఎండీ ముందస్తు సమాచారం జారీ చేసింది. గురువారం పగటి పూట గరిష్ట ఉష్ణోగ్రత 38 డిగ్రీల సెల్సియస్ పైబడిన ప్రాంతాల్లో వాతావరణ వివరాలు.

ప్రాంతం గరిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)

పర్లాకిమిడి	39.8	రాయగడ	38.6
బౌధ్	39.5	కటక్	38.4
టిట్లాగడ్	39.2	ఝార్సుగుడ	38.3
నయాగడ్	39.2	చాంద్‌బాలి	38.2
భవానీపట్న	39.0	మల్కన్‌గిరి	38.2
బొలంగీరు	38.9	అంగుల్	38.1
ఫుల్బాణి	38.9	సంబలపూర్	38.0
తాల్చేరు	38.6	హీరాకుద్	38.0

హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్టు



అరెస్టైనవారిని చూపిస్తున్న పోలీసులు

బరంపురం: జిల్లాలోని గొళంతర పోలీసుస్టేషన్ పరిధి పనపల్లి గ్రామంలో టి.జయజనార్దన్ రెడ్డిపై జరిగిన హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపిన వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం పనపల్లి గ్రామంలో పాత కక్షలతో టి.జయజనార్దన్ రెడ్డిపై ప్రత్యర్థులు మారణాయుధాలతో దాడిచేసి గాయపరిచారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయలతో ఉన్న జయజనార్ధన్ రెడ్డిని ఎంకేసీజీ మెడికల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్నటువంటి నిందితులను అరెస్టు చేశారు. అరెస్టైనవారిలో పి.నీలంబర్ రెడ్డి, బిరన్ రెడ్డిలు ఉన్నట్లు వెల్లడించారు.

తోడేలు దాడిలో ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న ఉత్పల్ సర్కార్

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎంవీ 93 గ్రామంలో గురువారం ఉదయం కాలకృత్యాలకు వెళ్లిన ఇద్దరు గ్రామస్తులపై ఒక్కసారిగా తోడేలు దాడి చేసింది. ఉత్పల్ సర్కార్ అనే వ్యక్తి గట్టిగా కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి రక్షించారు. అనంతరం తోడేలును కొట్టి చంపేశారు. గాయాలు పాలైన ఉత్పల్‌ను మలకన్‌గిరి ప్రభుత్వాస్పత్రికు తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం మెరుగుగానే ఉన్నట్లు వెల్లడించారు.

నలుగురు పేకాటరాయుళ్లు అరెస్టు



అరెస్టైన పేకాటరాయుళ్లు

జయపురం: సదర్ పోలీసులు పేకాట శిబిరంపై దాడి నిర్వహించి నలుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి వెల్లడించారు. వారి దగ్గర నుంచి రూ.10,130 నగదుతో పాటు పేకముక్కల దస్తాలు స్వాధీనం చేసుకున్నారు. పనసపుట్ భగర గ్రామ సమీప అడవిలో పేకాట జోరుగా సాగుతున్న సమాచారం అందింది. దీంతో పెట్రోలింగ్ జరుపుతున్న స్టేషన్ ఏఎస్ఐ ప్రియదర్శి గొమాంగో ఇతర పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించారు. అరెస్టైనవారిలో గ్రామానికి చెందిన బి.రుజి, హెచ్.హరిజన్, ఆర్.హరిజన్, ఎస్.గదబ ఉన్నట్లు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్‌శాఖ ఏఈపై ఫిర్యాదు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి విద్యుత్‌శాఖ ఏఈ బి. వి.సురేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోడాం పంచాయతీ మాజీ సర్పంచ్ పంగ చంద్రరా వు వైఎస్సార్‌సీపీ నాయకుడు నేతింటి సింహాచలం బుధవారం టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు నిధులతో టీడీపీ నాయకుల ప్రోత్సాహంతో సోడాం పంచాయతీలో ని సోడాం, శ్రీనివాసపురం, లక్ష్మీనారాయణపురం, సూర్యనారాయణపురం గ్రామాల్లో కొత్త విద్యుత్ లై న్లు, స్తంభాలను ఏర్పాటుచేస్తున్నారని, విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎస్‌హెచ్‌జీ ప్రెసిడెంట్ టు ఎమ్మెల్యే అభ్యర్థి

- సుజాత సాహుకు బీజేడీ టిక్కెట్టు కేటాయింపు



భువనేశ్వర్: ఒక సామాన్య మహిళకు బిజూ జనతా దళ్ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించింది. స్వయం సహాయక బృందం (ఎస్‌హెచ్‌జీ) అధ్యక్షురాలు నుంచి బిజూ జనతా దళ్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సుజాత సాహు ఎదగడం విశేషం. జాజ్‌పూర్ జిల్లా దశరథ్‌పూర్ మండలానికి చెందిన సుజాతా సాహు జాజ్‌పూర్ శాసనసభ నియోజకవర్గం బీజేడీ అభ్యర్థిగా ఎంపికయ్యారు. జాజ్‌పూర్ స్థానం నుంచి వరుసగా 3 సార్లు గెలిచి, దళంలో సంస్థాగత కార్యదర్శిగా కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రణబ్ ప్రకాష్ దాస్ (బాబీ) స్థానంలో పోటీకి టికెట్ పొందడం సంచలనం రేపింది. ఒకప్పుడు సుజాత సాహు తౌరొపాదా పంచాయతీ పెంతొబడొ గ్రామానికి చెందిన మా సరస్వతి స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలిగా పని చేసేవారు. బ్యాగ్‌లు, ఫైల్‌లు, ఫోల్డర్‌లు మొదలైన వాటిని తయారు చేయడం ద్వారా మహిళలకు సాధికారత కల్పించడంలో ఈ బృందం ప్రధాన పాత్ర పోషించింది. తర్వాత ఈమె 2017లో బీజేడీ మద్దతుతో తొలిహా పంచాయతీ సమితి సభ్యురాలిగా ఎన్నికైంది. రాజకీయాల తొలి అడుగులో పార్టీ ఈమెకు దశరథ్‌పూర్ పంచాయతీ సమితి అధ్యక్షురాలిగా పట్టం గట్టింది. ప్రస్తుతం ఆమె మహిళా స్వయం సహాయక సంఘం జిల్లా స్థాయి కమిటీలో డీఎల్ఎఫ్ చైర్‌పర్సన్‌గా పనిచేస్తున్నారు. దక్షత అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున దుబాయ్ పర్యటనకు కూడా వెళ్లింది. బీజేడీ తన పేరును ప్రకటించడంతో ఆమె ఇంకా షాక్‌లో ఉన్నారు.

వ్యవసాయ బలి జాతర ప్రారంభం



ఘటాలతో వస్తున్న ప్రజలు

జయపురం: సదరు సమితి గొడొపాదర్ గ్రామంలో రాజుల కాలం నుంచి పాటిస్తున్న వ్యవసాయ సంబంధిత బలి జాతర గురువారం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎకంబా గ్రామం నుంచి ఘటాలతో వచ్చిన ప్రజలకు స్వాగతం పలికి, పూజలు చేసి వారిని బలిఘాట్‌కు తీసుకెళ్లారు. అనంతరం బలి జాతర మైదానంలో భీమ, భీమాణిలకు పూజలు చేశారు.

ఈ జాతరను ప్రతీ ఐదేళ్లకు ఒకసారి నిర్వహించారు. సాంప్రదాయం ప్రకారం స్నేహ గ్రామం ఎకంబా ప్రజలను ఆహ్వానించామని పూజారులు తెలిపారు.

ప్రభుత్వ లాంఛనాలతో ఆర్మీ జవాన్ అంత్యక్రియలు



జోగారావుకు నివాళులు అర్పిస్తున్న మంత్రి అప్పలరాజు

పలాస: మండలంలోని మోదుగులపుట్టి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ మద్దిల జోగారావుకు గురువారం ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మంత్రి సీదిరి అప్పలరాజు హాజరై పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. ఆర్మీలో సేవలందిస్తూ దేశ సరిహద్దులో రెండు రోజుల క్రితం ఆయన మృతి చెందిన విషయం తెలిసిందే. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎలుగు బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



మృతుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీసీ సంఘ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని చీపురపల్లి పంచాయతీ అనకాపల్లిలో ఇటీవల ఎలుగుబంట్ల దాడిలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే అదుకోవాలని బీసీ సంఘ ప్రతినిధులు కోరారు. గురువారం మానవ హక్కుల వేదిక ప్రతినిధులు మృతుల కుటుంబాలను పరామర్శించారు. అనంతరం అటవీ శాఖాధికారులను కలిసి వారితో మాట్లాడారు. ఉద్దాన ప్రాంతంలో ఎలుగులు నిత్యం దాడి చేస్తున్నా చర్యలు చేపట్టకపోవడం సరికాదన్నారు. ఓవైపు రిజర్వ్ ఫారెస్ట్ భూముల పంపిణీ, తవ్వకాలు చేయడంతో వన్యప్రాణులకు అవాసాలు లేక గ్రామాల్లోకి ప్రవేశిస్తూ దాడులకు పాల్పడుతున్నాయని చెప్పారు. అధికారులు స్పందించి రిజర్వ్ ఫారెస్ట్ భూములను పరిరక్షిస్తూ వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బి.ఢిల్లీరావు, పోతనపల్లి కామేశ్వరరావు, కోనారి ఈశ్వరమ్మ, ఇరోతు గురుమూర్తి, గండు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శ్రీకాశికి జ్యూయలర్స్ షాపు ప్రారంభం



జ్యూయలర్స్ షోరూంను ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సిక్కోలు ప్రజల అభిరుచికి తగ్గట్టుగా సరికొత్త బంగారు ఆభరణాలు శ్రీకాశికి జ్యూయలర్స్ (ఎస్‌కేజే)లో లభిస్తాయని మంత్రి ధర్మాన ప్రసాదరావు సతీమణి గజలక్ష్మి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్ కూడలి వద్ద ఎస్‌కేజే షోరూమ్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేర్ల సాంబమూర్తి బంగారం వ్యాపారంలో మరింత రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, నాయకులు మండవల్లి రవి, గుండ లక్ష్మిదేవి, కూన రవికుమార్, గొండు శంకర్, వ్యాపారులు పేర్ల సాంబమూర్తి, పేర్ల కిషన్ మోహన్‌కుమార్, పేర్ల హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెంగ తీర్చిన భరోసా



- జిల్లాలో 70,611 మందికి వైఎస్సార్ మత్స్యకార భరోసా లబ్ధి
- ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.70.61 కోట్ల మేర పంపిణీ

అరసవల్లి:

కడలినే నమ్ముకున్న మత్స్యకారుల కష్టాన్ని గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర హామీని ఐదేళ్లు అమలు చేసి అండగా నిలిచారు. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 అర్ధరాత్రి వరకు సముద్రంలో వేట నిషేధ కాలం అమలౌతున్న నేపథ్యంలో మత్స్యకారులకు భరోసాగా జీవన భృతి కింద ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేల నగదును నేరుగా వారి ఖాతాల్లో జమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ మత్స్యకార భరోసా పేరిట పథకాన్ని విజయవంతంగా అమలు చేసింది. అధికారంలోకి వచ్చిన వెంటనే తొలిగా మత్స్యకారులకే ఈ పథకాన్ని వర్తింపజేస్తూ డీబీటీ ద్వారా నగదు జమ చేసింది. గంగపుత్రుల బెంగ తీర్చేలా వేటనిషేధ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన భరోసాపై మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దళారుల బెడద లేకుండా..

వేట నిషేధ కాలంలో 11 మండలాలకు చెందిన మత్స్యకారులకు వైఎస్సార్ మత్స్యకార భరోసా వర్తింపజేశారు. గతంలో ఇచ్చిన రూ.4 వేల భృతిని ఏకంగా రూ.10 వేలకు పెంచారు. రేషన్ కార్డుకు ఒకరు చొప్పున ప్రతి మోటార్ బోటుకు యజమానితో సహా ఆరుగురు చొప్పున, నాన్ మోటరైజ్డ్ బోటుకు యజమానితో సహా ముగ్గురు మత్స్యకారులకు ఈ భరోసా పథకాన్ని వర్తింపజేశారు. మొత్తంగా 2019 నుంచి ఇప్పటివరకు మొత్తం 70,611 మంది వేట మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.70.61 కోట్లు నగదు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేశారు. ఎక్కడా మధ్యవర్తుల జోక్యం లేకుండా ప్రభుత్వం డీబీటీ ద్వారా నగదు జమ చేయడంతో అర్హులంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

సంవత్సరం	లబ్ధిదారులు	వేట నిషేధ భృతి (రూ.కోట్లలో)
2019-20	13386	రూ. 13.38
2020-21	14289	రూ. 14.28
2021-22	13612	రూ. 13.61
2022-23	14043	రూ. 14.04
2023-24	15281	రూ. 15.28
మొత్తం	70,611	రూ.70.61 కోట్లు


మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట



మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచేలా జగనన్న ప్రభుత్వం పనిచేసింది. మా మత్స్యకారుల వలసలకు అడ్డుకట్ట వేసేందుకు, జిల్లా ముఖచిత్రం మార్చేందుకు మూలపేటలో భారీపోర్టు, బుడగట్లపాలెం, మంచినీళ్లపేటలో ఫిషింగ్ హార్బర్లు నిర్మాణాలు చేపడుతోంది. వచ్చే ఏడాది మళ్లీ జగనన్నే సీఎం హోదాలో వీటిని ప్రారంభించాలని కోరుకుంటున్నాం.

– కోనాడ నరిసింగరావు, డీఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు

ఐదుసార్లు అందుకున్నా...



వేటకు నిషేధ సమయంలో గత ప్రభుత్వం మాకు రూ. 4 వేలు ఇచ్చేది. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వరుసగా ఐదేళ్లుగా రూ.10 వేలు చొప్పున భృతి అందించారు. మధ్యవర్తు ల ప్రమేయం లేకుండా భృతి అందిస్తూ మత్స్యకారుల సంక్షేమ, ఉపాధికి ఈ ప్రభుత్వం బాగా పనిచేసింది. మళ్లీ ఇదే ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరుకుంటున్నాం.

– బైపల్లి రామారావు, మత్స్యకారుడు, ఇసకలపాలేం

క్లుప్తంగా

విధుల నుంచి ఇద్దరు ఏపీ వీవీపీ ఉద్యోగుల తొలగింపు

విజయనగరం ఫోర్ట్: వైద్య విధాన్ పరిషత్ పరిధిలో ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులను విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయధికారి (డీసీహెచ్‌ఎస్) ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్.కోట ఆస్పత్రిలో ఫిజియోథెరపిస్టుగా పనిచేస్తున్న ప్రీతి.ఎల్, ల్యాబ్ అటెండెంట్‌గా పనిచేస్తున్న రెల్లిమన్మథరావులను టెర్మినేట్ చేసారు. 2022లో వారి నియామకం జరిగింది. వాస్తవంగా వారిని ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించాలి. కానీ వైద్య విధాన్ పరిషత్ అధికారులు కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించారు. మిగతా జిల్లాలన్నింటిలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారు. విజయనగరం జిల్లాలో కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించడంతో అధికారుల తీరుపై పలు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వైద్య విధాన్ పరిషత్ కమిషనర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఔట్ సోరింగ్ ఉద్యోగుల జీతాలకు, కాంట్రాక్టు ఉద్యోగుల జీతాలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కంటే కాంట్రాక్ట్ ఉద్యోగులకు జీతం ఎక్కువ.

15 మద్యం సీసాల పట్టివేత

వేపాడ: మండలంలోని చామలాదేవి అగ్రహారంలో వల్లంపూడి ఎస్సై రాజేష్ నేతృత్వంలో సిబ్బంది గురువారం నిర్వహించిన దాడుల్లో గ్రామానికి చెందిన వ్యక్తి 15 మద్యం సీసాలతో పట్టుబడ్డాడు. దీంతో పట్టుబడిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో అనుమతుల్లేకుండా మద్యం విక్రయించినా, సారా తయారుచేసి విక్రయించినా చట్టరీత్యాచర్యలు తప్పవని హెచ్చరించారు. మద్యం విక్రయం. సారా తయారీ సమాచారం అందించే వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై చెప్పారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



కొమరాడ: దగ్ధమవుతున్న పూరిల్లు

కొమరాడ: మండలంలోని చినఖేర్జెల గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కె.రవికుమార్‌కు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఈ ప్రమాదంపై స్థానికులు చెప్పిన వివరాలిలా ఉన్నాయి. గురువారం వేకవజామున నాలుగు గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి నిప్పులు రావడం, గ్యాస్ లీక్ అవడంతో అగ్నిప్రమాదం సంభవించింది. వేసవికాలం కావడంతో కుటుంబ సభ్యులు ఆరుబయట నిద్ర పోవడం వల్ల పెనుప్రమాదం తప్పింది. దీంతో ఇంట్లో ఉన్న గృహోపకరణాలతో పాటు పొలానికి సంబంధించిన డాక్యుమెంట్స్, బ్యాంక్ పాస్‌బుక్స్, ఆధార్ తదితర విలువైన వస్తువులతో పాటు రూ.లక్ష నగదు కాలిబూడిదైందని బాధితుడు రవికుమార్ వాపోయాడు.

12 కిలోల గంజాయి పట్టివేత

భామిని: ఆంధ్రా, ఒడిశా సరిహద్దులో గల బత్తిలి చెక్‌గేట్ వద్ద గురువారం పోలీసులు జరిపిన తనిఖీల్లో ఒడిశా నుంచి అక్రమంగా తరలివస్తున్న 12 కిలోల గంజాయిని ఎస్సై చిట్టిపోలు ప్రసాద్ పట్టుకుని సీజ్ చేశారు. ఆ గంజాయిని తరలిస్తున్న ఇద్దరు మహారాష్ట్రీయులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఒడిశాలోని కెందుగూడ నుంచి వస్తున్న ప్రైవేట్ బస్సులో రెండు బ్యాగ్‌లతో తరలిస్తున్న గంజాయిని పట్టుబడిందని, సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మక్కువ: మండలంలోని కన్నంపేట గ్రామానికి చెందిన చీపురు ఉమామహేష్(40) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో వివాహ మంటపంలో ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు స్పందించి బొబ్బిలి సీహెచ్‌సీకీ తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య లలిత ఉంది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పి.నరసింహమూర్తి తెలిపారు.

జాతరలో ఆటో మాయం

భోగాపురం: మండల కేంద్రం భోగాపురంలో మూడురోజులుగా జరుగుతున్న కనకదుర్గతల్లి అమ్మవారి జాతరలో ఓ ఆటో మాయం అయింది. భోగాపురంలో జరుగుతున్న జాతర సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు డెంకాడ మండలం చుక్కవానిపేట గ్రామానికి చెందిన చుక్క సత్యనారాయణ కుటుంబసభ్యులతో కలిసి తన సొంత ఆటోలో భోగాపురం వచ్చాడు. ఈ క్రమంలో ఆటోను మార్కెట్ సెంటర్‌లో పార్కింగ్ చేసి కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారి దర్శనానికి వెళ్లాడు. అమ్మవారిని దర్శించుకుని తిరిగి వచ్చి చూసేసరికి ఆటో కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. దీంతో సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవికుమార్ గురువారం తెలిపారు.

ఎన్నికల అక్రమాలపై నిరంతర నిఘా

- కంట్రోల్ రూమ్ ద్వారా కలెక్టర్ పర్యవేక్షణ
- నియమావళిని ఉల్లంఘిస్తే సీ-విజిల్
- ఫిర్యాదు అందిన 100 నిముషాల్లోనే చర్యలు
- 150కి పైగా వినతులు, ఫిర్యాదుల స్వీకరణ

విజయనగరం అర్బన్:

ఎన్నికల ప్రక్రియను అత్యంత పారదర్శంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందు జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఎన్నికల కంట్రోల్ రూమ్‌లో కంప్లెయింట్ సెల్ సిబ్బంది నిరంతరాయంగా పనిచేస్తున్నారు. సీ-విజిల్, కాల్ సెంటర్, 1950 హెల్ప్‌లైన్ తదితర ఆరు విభాగాల్లో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు వివిధ విభాగాలకు సంబంధించి 150 ఫిర్యాదులు, వినతులు అందాయి. అత్యధికంగా సీ-విజిల్, ఎన్‌జీఎస్‌పీ మాధ్యమాల ద్వారా వచ్చాయి. వీటిలో ఇప్పటికే 140 పరిష్కరించారు. ఎన్నికల కంట్రోల్ రూమ్‌ను నేరుగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి పర్యవేక్షిస్తున్నారు. కంప్లెయింట్ సెల్‌కు జిల్లా ప్రణాళిక అధికారి (సీపీఓ) పి.బాలాజీ పర్యవేక్షణాధికారిగా వ్యవహరిస్తున్నారు.



మీడియా/టీవీ మోనటరింగ్ విభాగంలో ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

సీ-విజిల్ యాప్

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు, అక్రమాలపై వీలైనంత వేగంగా, సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేసేందుకు ప్రజలకిచ్చిన గొప్ప అవకాశం సీ-విజిల్ మొబైల్ యాప్. ఇటీవలే అందుబాటులో వచ్చిన ఈ యాప్ ను పౌరులు ఎవరైనా గూగుల్ ప్లే స్టోర్ నుంచి తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఏదైనా అంశంపై ఫిర్యాదు చేయడానికి ఈ యాప్‌ను తెరిచి విండో లో సంబంధిత అంశానికి సంబంధించిన ఫొటో లేదా 2 నిముషాల వీడియో తీసి అప్‌లోడ్ చేయవ చ్చు. లైవ్ ఫొటోలు, వీడియోలు, జియో కోర్డినేట్స్ లో సహా ఇది స్వీకరించి పంపుతుంది. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత ఫ్లయింగ్ స్క్వాడ్ లేదా ఇతర అధికారులకు సమాచారం వెళ్తుంది. జియో కోఆర్డినేటర్స్ ఆధారంగా అధికారులు సంఘటనా స్థలానికి వెంటనే చేరుకొనే అవకాశం కలుగుతుంది. ఆ అంశాన్ని స్క్వాడ్ పరిశీలించి కేవలం 100 నిముషాల్లోనే చర్యలు తీసుకుంటుంది.



సీ-విజిల్ విభాగంలో కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ అధికారి, సీపీఓ పి.బాలాజీ

ఓటరు హెల్ప్‌లైన్ 1950

ఓటర్లకు అన్ని రకాల సహాయ సహకారాలను అందించేందుకు ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ ఇది. ఈ టోల్ ఫ్రీ నంబర్‌కు జిల్లాకు చెందిన ఓటర్లు నేరుగా ఫోన్‌చేసి తమ సమస్యలను తెలియజేయవచ్చు. కావాల్సిన సేవలను పొందవచ్చు. ఈ కాల్ సెంటర్ 24 గంటలూ పనిచేస్తుంది. ఇక్కడకు వచ్చిన ఫోన్లను రికార్డు చేసి, చర్యల కోసం సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి పంపిస్తారు.

24 గంటల కాల్ సెంటర్

ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన వెంటనే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి కాల్ సెంటర్ ఏర్పాటయ్యింది. ఫోన్ నంబర్లు 08922-797120, 08922-797124కు ఫిర్యాదు చేయవచ్చు. ఇవి కూడా 24 గంటలూ పనిచేస్తాయి. ఇక్కడికి వచ్చే ఫిర్యాదులను, వినతులను తక్షణమే సంబంధిత అధికారులకు పంపించి చర్యలు తీసుకుంటారు. ఓటరు జాబితాలో తమ పేర్లు ఉన్నదీలేనిదీ ఫోన్‌చేసి తెలుసుకోవచ్చు.

చురుగ్గా సోషల్ మీడియా విభాగం

ఎన్నిల ప్రక్రియలో సోషల్ మీడియా అత్యంత చురుకైన పాత్ర పోషిస్తోంది. ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్), ఇన్‌స్ట్రాగామ్, యూ ట్యూబ్ తదితర సోషల్ మీడియాపై నిరంతర నిఘా పెట్టేందుకు ఈ విభాగం ఏర్పాటైంది. సోషల్ మీడియాల్లో వచ్చే ఎన్నికల ప్రచారం, ప్రకటనలు, పోస్టింగులపై ఈ విభాగం అధికారులు నిరంతరం పర్యవేస్తున్నారు. రాజకీయ ప్రముఖుల సోషల్ మీడియ ఖాతాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టి, వారు పెట్టే పోస్టింగ్‌లను పరిశీలిస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియామావళిని అతిక్రమించే పోస్టింగ్‌లపై చర్యలు తీసుకుంటున్నారు. దీనిని జిల్లా గృహ నిర్మాణ శాఖ పీడీ వి.శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు.

రిపోర్ట్స్ మోనటరింగ్ సెల్

వివిధ విభాగాలకు వచ్చే ఫిర్యాదులు, జిల్లాలో నమోదు చేసిన కేసులు వాటిపై తీసుకున్న చర్యలను జిల్లా ఎన్నికల అధికారి ద్వారా ముఖ్య ఎన్నికల అధికారికి ప్రతిరోజు పంపిస్తున్నారు. ప్రవర్తనా నియమావళి అమలు, వ్యయ పరిశీలన అంశాలను నోడల్ అధికారులు ఎన్నికల కంట్రోల్ రూమ్ నుంచే పర్యవేక్షిస్తున్నారు.

ఇప్పటి వరకు జిల్లాలో అందిన ఫిర్యాదులు		
స్వీకరించిన మాధ్యమాలు	అందిన ఫిర్యాదులు	పరిష్కరించినవి
సీ-విజిల్ యాప్	66	66
ఎన్‌జీఎస్‌పీ	35	23
1950 హెల్ప్‌లైన్	00	00
సీఈఓ ఏపీ	11	09
ఓటర్ హెల్ప్‌లైన్	18	14
24 గంటల కాల్ సెంటర్	12	11
ఓటర్ పోర్టల్, ఓటర్ మిత్రా	17	17
మీడియా సెల్	24	21
సోషల్ మీడియా	02	02

ప్రశాంతంగా న్యాయవాద సంఘం ఎన్నికలు



మద్దతు దారులతో గెలుపొందిన అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: విజయనగరం జిల్లా కేంద్ర న్యాయవాదుల సంఘం ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ ప్రక్రియ మధ్యాహ్నం 2.30 గంటలకు ముగిసింది. 473 మంది సభ్యులు వారి ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఓటింగ్ ప్రక్రియలో సీనియర్లు, జూనియర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. మధ్యాహ్నం 3.30 గంటలకు లెక్కింపు ప్రక్రియ ప్రారంభించగా సాయంత్రం 6 గంటలకు ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికలకు పి. శ్రీరామ్మూర్తి, కె.రవిబాబు, ఏవీఎస్ పద్మజ అధికారులుగా వ్యవహరించారు. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా అల్లాడ హరీష్ తన సమీప ప్రత్యర్థి కె. శ్రీనివాసరావుపై 109 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా దాసరి ఈశ్వరరావు సమీప ప్రత్యర్థి పి.శివప్రసాద్‌పై 45 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. జాయింట్ సెక్రటరీగా వైపీవీఆర్ మూర్తి, కోశాధికారిగా భీంపల్లి రవి విజయం సాధించారు. తమ విజయానికి సహకరించిన సీనియర్, జూనియర్ న్యాయవాదులకు గెలుపొందిన అభ్యర్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. న్యాయవాదుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని ఈ సందర్భంగా వారంతా పేర్కొన్నారు.

వడదెబ్బ పట్ల అప్రమత్తం

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు



డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: వేసవి కాలం దృష్ట్యా వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. జాగ్రత్తలు పాటించడం ద్వారా వడదెబ్బ మరణాలు అరికట్టవచ్చునన్నారు. ఎండతీవ్రత వల్ల శరీర ఉష్ణోగ్రత పెరిగి (104 డిగ్రీలఫారన్ హీట్) మెదడు మీద ప్రభావం చూపుతుందని, దీనివల్ల మెదడులోని ఉష్ణోగ్రత నియంత్రించే కేంద్రం దెబ్బతిని వడదెబ్బ బారిన పడతారన్నారు. చెమట పట్టికపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు, మగత నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితి, ఎండలో బయటకు వెళ్లినప్పుడు ఈ లక్షణాలు కనిపించినట్లయితే సమీపంలోని వైద్యుడిని సంప్రదించి ప్రాథమిక చికిత్స పొందాలని సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా గొడుగు వాడడం, తెలుపురంగు లేదా పలుచని చేనేత వస్త్రాలు ధరించాలని చెప్పారు. తలకు టోపీ కానీ రుమాలు కానీ వాడాలన్నారు. వేడిగాలులు తగలకుండా చూసుకోవాలని, ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య కాలంలో ఆరుబయట అధిక శారీరక శ్రమతో కూడిన పనిచేయకూడదని చెప్పారు. దూర ప్రయాణాలు చేయవలసి వచ్చినప్పుడు ఉదయం 11 గంటలలోపు, సాయంత్రం 4 గంటల తరువాత చేయాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు ఒక గ్లాసు మంచి నీరు తాగాలన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రదేశానికి తీసుకు వెళ్లాలని, చల్లని నీటిలో ముంచిన వస్త్రంతో శరీరం తుడవాలని, శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేవరకు అలాగే చేస్తూ ఉండాలని చెప్పారు.

ఎన్నికల నిర్వహణలో పీఓల పాత్ర కీలకం



శిక్షణ కార్యక్రమంలో పీఓ,ఏపీఓలనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

- కలెక్టర్ నాగలక్ష్మి

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఎన్నికల నిర్వహణలో పీఓల పాత్ర అత్యంత కీలకమని, తప్పు దొర్లకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియ, విధులు, బాధ్యతలు, ఈవీఎంలు, వీవీప్యాట్ల పనితీరు పట్ల ప్రిసైడింగ్ అధికారులు(పీఓ), సహాయ ప్రిసైడింగ్ అధికారుల(ఏపీఓ)కు చీపురుపల్లి నియోజకవర్గంలోని గరివిడి ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల కమిషన్ రూపొందించిన వీడియోను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజున సంబంధిత పోలింగ్ బూత్‌లలో పీఓలదే పూర్తి అధికారమని తెలిపారు.అందరి విధులపైన పీఓలకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పులు,పొరపాట్లు జరగకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పీఓలు నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని, ఎన్నికల కమిషన్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. తమ వ్యక్తిగత అభిప్రాయాలను,అభిమానాన్ని ఎక్కడా ప్రదర్శించరాదని హితవు పలికారు. జిల్లాలోని 360 సున్నిత పోలింగ్ కేంద్రాల్లో మరింత అప్రమత్తంగా విధులను నిర్వహించాలని, ప్రతిచోటా పోలింగ్‌కు 90 నిమిషాల ముందే తప్పనిసరిగా మాక్‌పోల్ నిర్వహించాలని సూచించారు. మాక్‌పోల్ అనంతరం ఈవీఎంలు డిలీట్ చేయాలని, వీవీప్యాట్లు ఖాళీ చేసి సీల్ చేయాలని చెప్పారు. పోలింగ్ ఏజెంట్లుగా వలంటీర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. హ్యాండ్ బుక్, చేయాల్సిన, చేయకూడని జాబితా, చెక్‌లిస్టులను తమతో పాటు ఉంచుకోవాలన్నారు. ముందు రోజు రాత్రే తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 5:30గంటలకే మాక్‌పోల్ జరుగుతుందని, ముందు రోజు రాత్రే బూత్‌లో ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని తెలిపారు. మూడు విడతల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సహాదిత్ వెంకట త్రివినాగ్,ఆర్డీఓ బి.శాంతి, తహసీల్దార్, ట్రైనర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్

లోపాలకు తావులేకుండా పోలింగ్ నిర్వహణ

విజయనగరం అర్బన్: జిల్లాలో జరిగే సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తూ పోలింగ్ నిర్వహణలో లోటుపాట్లకు తావివ్వకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశించారు. ఈ మేరకు విజయనగరంలోని ఎంఆర్ కళాశాలలో గురువారం జరిగిన అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి పీఓలు, ఏపీఓల శిక్షణ తరగతుల్లో జేసీ మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. పోలింగ్ నిబంధనలపై పూర్తిగా అవగాహన ఏర్పరచుకుని విధులు నిర్వర్తించడం ద్వారా ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఉండదన్నారు. అలాగే ఎస్.కోట, నెల్లిమర్లలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో జేసీ పాల్గొన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు నూకరాజు, మురళీకృష్ణ, విజయనగరం తహసీల్దార్ రత్నం, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పైడితల్లి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఈఓ డీవీవీ.ప్రసాదరావు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని గురువారం అమ్మవారి కల్యాణ మంటపంలో లెక్కించారు. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ 29 రోజులకు గాను రూ.10 లక్షల 94వేల 587 నగదు, 24 గ్రాముల 400 మిల్లీ గ్రాముల బంగారం, 92 మిల్లీ గ్రాముల వెండి లభించిందన్నారు. అదేవిధంగా వనంగుడి హుండీల ద్వారా 90 రోజులకు రూ.8 లక్షల 38వేల 713 నగదు, 5గ్రాముల 400 మిల్లీ గ్రాముల బంగారం, 315 మిల్లీ గ్రాముల వెండి లభించిందని వివరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో పీఓల విధులు ప్రతిష్టాత్మకం

రాజాం సిటీ: ఎన్నికల్లో పీఓల విధులు అత్యంత ప్రతిష్టాత్మకమని, పీఓగా విధులు నిర్వహించడం గొప్ప అవకాశమని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. రాజాం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో పీఓలు, ఏపీఓల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కతప్పు దొర్లకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. ఎన్నిక ప్రక్రియ విధులు, ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై పీఓలు, ఏపీఓలు సంపూర్ణ అవగాహన కలిగిఉండాలని సూచించారు. పోలింగ్ రోజు సంబంధిత పోలింగ్ బూత్‌లో పీఓలదే పూర్తి అధికారమని పేర్కొన్నారు. అందరి విధులపై పీఓలకు అవగాహన ఉండాలని సూచించారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, తప్పులు, పొరపాట్లు జరగకుండా చూడాల్సిన బాధ్యత తమదేనన్నారు. పీఓలు నిష్పక్షపాతంగా వ్యవహరించి ఎన్నికల కమిషన్ ఆదేశాలు అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 360 సున్నిత పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ప్రతిచోట పోలింగ్‌కు 90 నిమిషాల ముందే తప్పనిసరిగా మాక్ పోలింగ్ నిర్వహించాలన్నారు. మాక్ పోల్ అనంతరం ఈవీఎంలు డిలీట్ చేయాలని, వీవీ ప్యాట్లు ఖాళీచేసి సీల్ వేయాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్లుగా వలంటీర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. ముందురోజు రాత్రే పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని, వీలైనంత త్వరగా పోలింగ్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. పీఓ, ఏపీఓలకు మూడు విడతల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పీఓలు ఫారం-17సి, పీఓ డైరీ, పీఓ రిపోర్ట్, పీఓ డిక్లరేషన్‌లను తప్పులు లేకుండా కచ్చితమైన వివరాలతో నింపాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సహాదిత్ వెంకట త్రివినాగ్, ఆర్వో జోసెఫ్, తహసీల్దార్ ఎస్.కె.రాజు, మాష్టర్ ట్రైనీలు పాల్గొన్నారు.

మానవాళి జీవితానికి మార్గదర్శకం భగవద్గీత

విజయనగరం: భగవద్గీతను ఆధ్యాత్మిక జ్ఞానంతో ఉపకరిస్తే జీవితం నేపథ్యాన్ని తెలియజేస్తుందని, మానవ జీవితంలో శాంతి,ఆనందం, ఆధ్యాత్మిక ఉన్నతికి మార్గదర్శకంగా ఉంటుందని విశాఖపట్నానికి చెందిన ఆధ్యాత్మిక ప్రవచన కర్త, నిష్కామ ఫౌండేషన్ అధ్యక్షురాలు అరుణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె పట్టణంలోని కొత్తపేట మన్నార్ రాజగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 30 నుంచి వచ్చే నెల 3 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6గంటల నుంచి రాత్రి 7:15 గంటల వరకు శ్రీ మన్నార్ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీ మద్భగవద్గీత రెండవ అధ్యాయం, సాంఖ్యయోగంపై ప్రవచించనున్నట్లు తెలిపారు. నేటి యువత భగవద్గీత గురించి తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ సతీష్ మాటూరు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కూరెళ్ల సరోజిని, రమేష్‌ల సహకారంతో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కంటి సమస్యలకు కార్పొరేట్ వైద్యం



నయనం ప్రధానం అన్న పెద్దల మాటకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది. వైఎస్సార్ కంటి వెలుగు కింద ఊరూరా వైద్యశిబిరాలు నిర్వహించడం.. విద్యార్థులతో పాటు వృద్ధుల్లో నేత్ర సమస్యలను గుర్తించి పరిష్కారం చూపే క్రతువును నిర్విఘ్నంగా కొనసాగిస్తోంది. అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించి చూపును ప్రసాదిస్తోంది. ఏటా వేలాది మంది నేత్ర సమస్యలకు చక్కటి పరిష్కారం 'చూపు'తుండడంతో ప్రభుత్వంపై ప్రశంసల జల్లు కురుస్తోంది.



సర్వజన ఆస్పత్రిలో రోగికన్నును పరీక్షిస్తున్న వైద్యుడు




ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు జాగరపు కన్నంనాయుడు. ఇతనిది దత్తిరాజేరు మండలం బూర్జివలస గ్రామం. కంటిచూపు సరిగా లేదని కొద్ది రోజుల కిందట ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కంటి విభాగంలో వైద్యునికి చూపించాడు. అక్కడ వైద్యులు రూపాయి ఖర్చులేకుండా అతనికి వైద్యపరీక్షలు నిర్వహించి ఆపరేషన్ చేశారు. 70 ఏళ్ల వయసులో కంటి చూపు చాలా బాగుందని సంతోషిస్తున్నాడు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు వాళ్ల సత్యం. గుర్ల మండల కేంద్రం. కొద్ది రోజుల కిందట కళ్లు మసకగా ఉన్నాయని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి కంటి విభాగంలో చూపించాడు. అతనికి పరీక్షలు చేసి శస్త్రచికిత్స చేశారు. ఇప్పుడు చూపుబాగుందని ఆయన చెబుతున్నాడు.

- ఏటా వేలాదిమందికి సేవలు
- సర్వజన ఆస్పత్రిలో కంటి సమస్యలు గుర్తించే అధునాతన పరికరాలు
- ఏటా 4 వేల నుంచి 5 వేల మందికి శస్త్ర చికిత్సలు
- ఏడాదికి 30 వేలు మంది వరకు ఓపీ సేవలు
- కంటి వెలుగులో రిఫర్ చేసిన వారికి ఆస్పత్రిలో చికిత్స
- పైసా ఖర్చులేకుండా చూపును ప్రసాదిస్తున్న ప్రభుత్వం



రోగికి కంటి అద్దాలు నిమిత్తం పరీక్షిస్తున్న ఆప్తాలమిక్ అసిస్టెంట్

విజయనగరం ఫోర్ట్: కంటి సమస్యలతో బాధపడే వారికి ఉపశమనం కల్పించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని తలపెట్టింది. విద్యాలయాలు, పల్లెలు, వార్డుల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తోంది. నేత్ర సమస్యలతో బాధపడేవారిని గుర్తిస్తోంది. చిన్నచిన్న సమస్యలు ఉన్నవారికి మందులతో పరిష్కారం చూపుతోంది. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత సేవలు అందిస్తోంది. ఏటా వేలాది మందికి చూపును ప్రసాదిస్తోంది. ఈ క్రతువును నిర్వహించేందుకు ప్రభుత్వాస్పత్రులకు లక్షలాది రూపాయల విలువైన ఆధునిక వైద్యపరికరాలను సమకూర్చింది. నిపుణులైన వైద్యులు, సిబ్బందిని నియమించి ఉత్తమ సేవలందిస్తోంది. దీనికి జిల్లా సర్వజన ఆస్పత్రిలో అందుతున్న కంటివైద్య సేవలే నిలువెత్తు నిదర్శనం.

ఆధునిక పరికరాలతో వైద్య పరీక్షలు

కంటి రోగులకు అధునాతన సాంకేతికతతో వైద్య సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వం వైద్య పరికరాలను సర్వజన ఆస్పత్రికి అందించింది. దృష్టి లోపం, కంటిలో దోషాలును గుర్తించడానికి ఆటో రెఫ్రాక్ట్ మీటర్, గ్లకోమా (నీటి కాసులవ్యాధి)ని గుర్తించే ఫీల్డ్ ఎనలైజర్, మెల్ల కన్ను లోపం గుర్తించే సినఫ్టోఫోర్, కంటిలోపల నరాలు దెబ్బతిన్నాయో లేదో నిర్ధారించే బి-స్కాన్ పరికరాలను సమకూర్చింది.



ఆటో రెఫ్రాక్ట్ మీటర్ మిషన్‌లో దృష్టి లోపాన్ని చూస్తున్న ఆప్తాలమిక్ అసిస్టెంట్

ఏటా వేలాది మందికి ఓపీ సేవలు

నేత్రసమస్యలతో బాధపడుతూ సర్వజన ఆస్పత్రిలో ఏటా 25 వేల నుంచి 30 వేల మంది ఓపీ సేవలు పొందుతున్నారు. వీరిలో 4 వేల నుంచి 5 వేల మందికి వైద్యులు శస్త్రచికిత్సలు చేస్తున్నారు. అలాగే, 2 వేల నుంచి 3 వేల మందికి కళ్లద్దాలు అందజేస్తున్నారు.

సర్వజన ఆస్పత్రిలో నేత్ర విభాగంలో అందించిన ఓపీ సేవలు వివరాలు:

సంవత్సరం	ఓ.పి సేవలు
2019-20	28,841
2020-21	10,144
2021-22	23,569
2022-23	28,500

కంటి శస్త్రచికిత్సలు ఇలా..

సంవత్సరం	ఆపరేషన్లు
2019	3,129
2020	1587
2021	4,649
2022	4,950